పంట నష్టం పెంచారు.. రైతుకు ఊరటనిచ్చారు..

రాజమహేంద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల వ్యవసాయ ఉద్యాన వన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.జిల్లాలో 1257 మంది రైతులకు చెందిన 20,385 హెక్టార్లలో నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా.జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి 1744 మంది రైతులకు సంబంధించిన 1008.90 హెక్టార్ల అరటి పంట నష్టపోయింది.153మంది రైతులకు చెందిన 68.96హెక్టార్లలో కూరగాయలు, ఇద్దరు రైతులకు చెందిన ఒక హెక్టారులో పూల తోట దెబ్బతింది. ప్రభుత్వం నుంచి ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇటీవల పెంచడంతో రైతుకు కొంత ఊరట లభించినట్టే.గతంలో ఎకరాకు రూ.6 వేలు, హెక్టారుకు రూ.15 వేలు మాత్రమే నష్టపరిహారం ఇచ్చేవారు.ఇవాళ ఎకరాకు రూ.10 వేలు,హెక్టారుకు రూ.25 వేలు ఇస్తున్నారు. ఉద్యాన పంట అరటికి హెక్టారు రూ.37 వేలు, కూరగాయలు, పూల పంటకు హెక్టారు రూ.25 వేలు ఇస్తున్నారు.

పంగిడి క్వారీల్లో అధికారుల తనిఖీ

కొవ్వూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో క్వారీల్లో అక్రమంగా 150 అడుగుల లోతు ఖనిజ సంపద తవ్వి, ఆ గోతులను పూడ్చకుండా వదిలివేస్తున్నారు. ఆ గోతుల్లో కొన్నిపరిశ్రమల నుంచి వెలువడే కెమికల్స్, చెత్త గోతుల్లో వేయడం వల్ల గ్రామంలో భూగర్భజలాలు కాలుష్యమవుతున్నాయని గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో ఆర్.సుస్మిత, జిల్లా మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎం.శంకరరావులతో కూడిన బృందం గోతులను పరిశీలించారు.



ఎర్రకాలువ ఉధృతి.. రాకపోకలు బంద్

నిడదవోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం కంసాలిపాలెం- తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య బుధవారం ఎర్రకాలువ నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో రాకపోకలను అధికారులు బంద్ చేశారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొంగువారిగూడెంలోని ఎర్రకాలువకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.



మొంథా తుఫాన్ మిగిల్చిన కష్టం అంతా ఇంతా కాదు.. పక్క చిత్రంలో రోడ్డును చూసి చెప్పేయ వచ్చు. మంగళవారం ఉదయం వరకూ ఇదీ ఉప్పాడ బీచ్ రోడ్డు పరిస్థితి.. తుఫాన్ ఉధృతికి బుధవారం ఉదయానికి ఇలా ముక్కలైపోయింది.. కనీసం వెళ్లడానికి దారిలేకుండా తయారైంది. - ఫొటోగ్రాఫర్- కాకినాడ

మొంథా వర్రీయే!



చివరికిలా : కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో నీట మునిగిన వరిచేను

తుఫాన్ మిగిల్చిన క(న)ష్టం..



పెదపూడిలో మొలకలు వచ్చిన వరిపనలు పరిశీలిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచేసింది.. వరి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. తుఫానకు ముందు రెండు రోజులు అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు చేలల్లో నీరు చేరి పంట దెబ్బతినగా తీవ్ర తుఫాన్‌తో మరింత నష్టపోయింది. రోజుల తరబడి నీళ్లల్లో పంట నానిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.326 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. నష్టం లెక్కింపు కొన సాగుతుండడంతో పెరిగే అవకాశం ఉంది. వరి, ఉద్యాన వన పంటలతో పాటు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల పొలాలు మునకలో ఉండడంతో యాప్ ద్వారా అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నష్టాల అంచనాలు తేల్చే పనిలో పడ్డాయి.

- లక్షలాది ఎకరాల్లో మునిగిన పంట
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- జిల్లాల వారీగా బృందాల ఏర్పాటు
- నష్టం అంచనాల్లో అధికారులు
- వారం రోజుల్లో పూర్తి నివేదిక
- అల్పపీడనంతో అక్కడక్కడా వానలు

కాకినాడలో రూ.98 కోట్లు

మొంథా తుఫాన్ జిల్లాలో అన్నదాతను నిలువునా ముంచేసింది. భారీ ఈదురుగాలులు, కుండపోత వానతో వరి వెన్నువిరిచింది. మరికొద్ది వారాల్లో చేతికి రానున్న పంటను చిదిమేసింది.దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు లబోదిబోమంటున్నారు. తుఫాన్ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతుండడంతో గురువారం పలు చోట్ల ఏకధాటిగా కుండపోతగా వాన కురిసింది. ఎగువన భారీ వర్షాలతో ఒక వైపు గోదావరి.. మరో వైపు ఏలేరుకు వరద ముప్పు పెరుగుతోంది. మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటడంతో వ్యవసాయశాఖ బుధవారం కాకినాడ జిల్లా వ్యాప్తంగా 368 గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నష్టం అంచనాలు వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేయగా గురువారం నాటికి ప్రాథమికంగా 50,700 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించారు.ఈ నష్టం విలువ రూ.98 కోట్ల వరకు అంచనా. మొత్తం జిల్లాలో 261 గ్రామాల్లో నష్టం జరగ్గా పంట నష్టపోయిన అన్నదాతలు 33,596 మందిగా గుర్తించారు.ఇది పెరగనుంది. పంట నష్టం అంచనాలు పూర్తయ్యే సరికి వారం పట్టనుంది. అత్యధికంగా పెదపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరి దెబ్బతింది. ధాన్యం తడిచి మొలకలు వచ్చేశాయి. గురువారం పర్యటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నష్టం తీవ్రతను మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్‌లో వివరించారు. మొక్కజొన్న 200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాల్లో నష్టపోయింది.



గోకవరంలో పొలాల పరిశీలనకు కాలినడకన కలెక్టర్ కీర్తి

తూర్పున రూ.80 కోట్లు

మొంథా కష్టమొచ్చింది..భారీ నష్టాన్ని మిగిల్చింది.. తుఫాన్ ప్రభావం కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షాలకు జనజీవనం అస్త వ్యస్తమైంది. జిల్లాలో వివిధ శాఖలకు సంబం ధించి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.107 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.అధికారులు క్షేత్రస్థాయిలో అంచనాల్లో నిమగ్నమయ్యారు.జిల్లాలో 209 గ్రామాలపై తుఫాన్ ప్రభావం చూపినట్టు అంచనా వేశారు. 10,626 మంది నష్టపోయారు. వరికి రూ.80 కోట్లు,అరటి, కూరగాయలు, పూలతోటలకు సంబంధించి సుమారు రూ.3.9 కోట్లు నష్టం జరిగింది. జిల్లాలో 56 గృహాలు దెబ్బతిన్నాయి. 68 రిలీఫ్ సెంటర్లు ఏర్పాటు చేసి, 2718 మందికి పున రావాసం కల్పించారు.18,872 మందికి ఆహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.జిల్లాలో 87.99 కిలో మీటర్ల మేర 48 ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిని రూ.54.57 కోట్ల నష్టం వాటిల్లింది. పంచా యతీ రాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలో మీటర్ల మేర దెబ్బతినగా రూ.45.81 కోట్లు నష్టం వాటిల్లింది.మైనర్ ఇరిగేషన్ వనరులు 21 దెబ్బతి నగా రూ.6.87 కోట్లు నష్టం జరిగింది. 123 వాటర్ ట్యాంక్‌లు డ్యామేజీ అయ్యాయి.జిల్లాలో 429 హెల్త్ సబ్-సెంటర్లు ఉన్నాయి. 251 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖకు రూ.37.34 లక్షలు నష్టం వచ్చినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

కోనసీమలో రూ.148 కోట్లు

మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 78 వేల ఎకరాల్లో రూ.148 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. 22 మండలాలు, మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీ పరిధిలో జరిగిన పంట నష్టాలు నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా యంత్రాంగాన్ని గురువారం ఆదేశించారు. నష్టాల అంచనాలో అధికార బృందాలు నిమగ్నమ య్యాయి. ఒకట్రెండురోజుల్లో తుఫాన్ నష్టాలను రూపొందించిన కలెక్టర్‌కు నివేదించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రాథమికంగా 31 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. ప్రత్యేక బృందాలను నియమించి నష్టాలను అంచనా వేస్తున్నారు. కౌలు రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో 300 విద్యుత్ స్తంభాలతోపాటు 125 కిలోమీటర్ల పరిధిలో చెట్లు, వివిధ రకాల వృక్షాలు కుప్పకూలాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని నివేదించారు.జిల్లాలో 47 పాఠశాలల్లో డ్యామేజీలు అయినట్టు విద్యాశాఖ అంచనాలు రూపొందించాయి. రానున్న ఐదు రోజుల్లో నివేదికలు రూపకల్పనలు చేసి సమర్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

తుఫాన్ బాధితులకు సాయమిలా..

తుఫాన్ వల్ల పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలతో పాటు కుటుంబానికి రూ.3 వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.వెయ్యి వంతున పరిహారం అందించడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. కాకినాడ తీరప్రాంతంలో ఉన్న 45 గ్రామాల్లో 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. చేనేత కార్మికులకు బియ్యాన్ని అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వీటిని ప్రారంభించి మూడురోజుల్లోగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుని ఇళ్లకు వెళ్లేవారికి ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంట నూనె, పంచదారతోపాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. పశు సంవర్థకశాఖ 50 శాతం రాయితీపై దాణాను పంపిణీకి సిద్ధం చేసింది.



గోపాలపురం మండలం వాదాలకుంటలో రహదారిపై ప్రవహిస్తున్న వాననీరు

వానలు..వరదలు..

తీవ్ర తుఫాన్ తీరం దాటి బలహీన పడి తీవ్ర వాయుగుండగా కొనసాగుతుండడంతో పలుచోట్ల భారీవర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం,సామర్లకోట, యు.కొత్తపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో 3 గంటలకుపైగా భారీగా కుండపోత వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ నిలిపివేశారు. మరో పక్క భారీ వర్షాలతో కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కాకినాడ-సామర్లకోట రహదారిలో పలుచోట్ల భారీగా నీరు చేరిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. అటు ఏలేరు రిజర్వాయరుకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో కొనసాగు తుండడంతో వరద ముప్పు పొంచి ఉంది. గురువారం ఉదయం ఇన్‌ఫ్లో 38 వేల క్యూసెక్కులకు చేరడంతో అధికారులు బెంబేలెత్తారు. ఇప్పటికే కాలువల ద్వారా నీరు 7 వేల క్యూసెక్కులకు దిగువకు వదులుతుండగా మరింత కిందకు వదిలితే అనేక మండలాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో ఆందోళన చెందారు. కిర్లంపూడిలో ఒక చోట గండిపడడంతో ఇసుక బస్తాలు ఉంచారు. ఏలేరుకు వరద తగ్గుతూ, పెరుగుతూ ఉండడంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ రిజర్వాయరును పరిశీలించారు.అన్నవరంలో పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతోంది.దీంతో తుని రూరల్ పరిధిలోని తిమ్మాపురం శివారున రహదారులపై నీరుచేరింది.

నేటి నుంచి వేటకు ఓకే..

మొంథా తుఫాన్ ముప్పుతో సముద్రంలో చేపల వేటను అధికారులు నిషేధించారు. దీంతో మత్స్యకారులు ఇళ్లకే పరిమితమై ఇబ్బంది పడుతున్నారు.తుఫాన్ ముప్పు తొలగడంతో మత్స్యకారులు శుక్రవారం నుంచి వేటకు వెళ్లవచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలు నేటితో నిలిపివేయనున్నారు.

ఉప్పొంగిన బురదకాలువ

- నీట మునిగిన శ్రీరంగపట్నం
- వీధుల్లో మీదుగా ప్రవాహం
- ఆందోళనలో ప్రజానీకం
- గోకవరంలో పంటలకు నష్టం
- ఆదుకోవాలని డిమాండ్





కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఊరి మధ్య నుంచి ఉధృతంగా బురద కాలువ

కోరుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలంలోని లోతట్టు గ్రామం అయిన శ్రీరంగపట్నంను గురువారం సాయంత్రం బురదకాలువ చుట్టిముట్టింది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి బురద కాలువ మీదుగా వరద నీరు శ్రీరంగపట్నంను చుట్టిముట్టింది. ఉదయం నుంచి బురద కాలువ వరద నీరు వస్తున్నప్పటికీ గ్రామంలోకి రాలేదు. అయితే సాయంత్రం సూరంపాలెం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేసి వరద నీటిని ఒక్కసారిగా దిగువకు విడుదల చేశారు.దీంతో బురద కాలువ వరదనీటి ఉధృతి పెరిగి శ్రీరంగపట్నం గ్రామంలో కాలువ పొంగి ప్రవహించింది. గ్రామంలోని వీధుల్లోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. బురద కాలువ శ్రీరంగపట్నం గ్రామ మధ్య నుంచి ఉండడంతో వరద వచ్చిన ప్రతి సారి గ్రామంపై బురద కాలువ పొంగి విరుచుకుపడడం గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ రాత్రికి వరద మరింత ఎక్కువైతే శ్రీరంగపట్నంలోని యానాదుల పేట, ఎస్సీ పేట, బీసీ కాలనీ, నాలుగు నుంచి ఐదు అడుగుల మేర ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం శ్రీరంగపట్నం గౌరీచౌక్ వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం, రాజీవ్‌గాంధీ విగ్రహాల వద్ద బురద నీరు కాలువపై నుంచి ఆర్ అండ్‌బీ రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఆ వరద నీరు గ్రామంలోని లోతట్టు ప్రాంతానికి చేరింది. అప్పటికప్పుడు అధికారులు, డీఎస్పీ వై. శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది కాలువ పొంగే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి వరద నీటిని అదుపు చేస్తున్నారు. బురద కాలువ వరద నీటి ఉధృతిపై సూరంపాలెం రిజర్వాయర్ అధికారులతో మాట్లాడుతున్నారు.

ఆదుకుంటాం : బత్తుల

మొంథా తుఫాన్ కారణంగా రాజానగరం నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతుకు న్యాయం చేసే ఏర్పాటు చేస్తామన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ నుంచి ఈ రాత్రికి వరద నీరు వదలకుండా ఆపు చేయమని రిజర్వాయర్ అధికారులకు చెప్పామన్నారు.

గోకవరంలో నీట మునిగిన 50 ఎకరాలు

గోకవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల నుంచి దిగువకు వస్తున్న వర్షపు నీటి కారణంగా తంటికొండ- అచ్యుతాపురం మధ్య ఉన్న బురదకాలువ (పెద్ద కాలువ) ఉధృతంగా ప్రవహించి పొంగి పొర్లడంతో సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. సుమారు 50 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగినట్టు రైతులు చెప్పుకొస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొస్తాయనుకున్న తరుణంలో దెబ్బ తీసింది. తంటికొండ, గాదెలపాలెం, అచ్యుతాపురం, కొత్తపల్లి తదితర గ్రామాలలో పంట పొలాలు నేలకొరగడంతో పాటు, నీట మునిగాయి. వేలాది రూపాయలను పెట్టుబడులగా పెట్టి సాగు చేసిన పంట నీటి పాలు కావడంతో కర్షకుడు కంటతడి పెడుతున్నాడు. నిండా ముంచిందని వాపోతున్నాడు.

పంట నష్టాలు అంచనా వేయండి



కడియం ఆవలో కలెక్టర్ కీర్తి చేకూరికి పంట నష్టం వివరిస్తున్న అన్నదాత

కడియం/గోకవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథాన్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కడియం, గోకవరం మండలాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. పంటల నష్టం అంచనా నివేదిక తయారు చేసి సకాలంలో సమర్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి దిగువకు వచ్చే వర్షపు నీటి వల్ల గోకవరంలో ముంపుకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించారు.అచ్చయ్యపేట సమీపంలో ఊరకాలువ మూసుకుపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నీటి పారుదల సౌకర్యాలు మెరుగు పర్చేలా తగిన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాణా సెంటర్ వద్ద ఉన్న బ్రిటిష్ కాలం నాటి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా అధికారులు తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అనంతరం తంటికొండలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు స్వయంగా తెలుసుకున్నారు. ఖచ్చితమైన వివరాలు సేకరించి నష్ట నివేదికను హేతుబద్ధంగా సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలన్నారు.అచ్చుతాపురం గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణపనులు పరిశీలించారు. నష్ట పరిహారానికి నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు.ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆర్డీవో కృష్ణనాయక్, డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబం టి నాని, తహశీల్దార్లు రామకృష్ణ, సునీల్‌కుమార్, ఎంపీడీవో గోవింద్, ఏపీవో అప్పలరాజు, కార్యదర్శులు శిరీష, రమణకుమారి ఉన్నారు.

కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశం



బిక్కవోలు మండలం రంగాపురంలో వరిచేలో నిలిచిన నీటిని చూపుతున్నరైతాంగం

పంట నీట మునిగితే ఇలా చేయండి

వ్యవసాయాధికారి మాధవరావు



కాల్దరిలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఉండ్రాజవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు నీట మునిగిన వరి చేలల్లో సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. గురువారం మండలంలోని కాల్దరి, వేలివెన్ను గ్రామాల్లో తుఫాన్‌కు నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వివిధ దశల్లో ఉన్న సార్వా వరికి శాస్త్రీయ పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని సూచించారు. పాలుపోసుకునే దశలో ఉన్న వరి పంట నీట మునిగితే గింజ రంగుమారి దిగుబడి, నాణ్యత తగ్గుతుందన్నారు. గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మాంకోజెబ్ కలిపిన మందును పిచికారి చేయాలని రైతులకు చెప్పారు. గింజగట్టిపడే దశ నుంచి కోత దశ చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుందన్నారు. రైతులు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక నష్టాన్ని నివారించవచ్చని సూచించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డా.చల్లా వెంకటనరసింహారావు, డా. మానుకొండ శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ఎం.శ్రీనివాస్, ఏవో బి. రాజారావు, రైతులు పాల్గొన్నారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆయుధాలివిగో...



- అమలాపురం ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'
- విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు
- ఆయుధాలు, డాగ్ స్క్వాడ్‌లతో డెమో ఇచ్చిన ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులను దగ్గరకు చేయాలనే సంకల్పంతో విద్యార్థి దశ నుంచే పోలీసుల విధి నిర్వహణపై అవగాహన కల్పించే లక్ష్యంతో 'ఓపెన్ హౌస్' నిర్వహిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. అమలాపురంలోని కోనసీమ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లోభాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రాహుల్ మీనా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పోలీసు విధి నిర్వహణలో ఉపయోగించే డ్రోన్ పరికరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంలో పురోగతి సాధిస్తున్నామన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఇంటికి రక్షణ కల్పించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం కారణంగా జరిగిన ప్రమాదాల్లో 19 మంది మరణించారన్నారు. సమాజంలో 99.09 శాతం మిగిలిన ఒక్క శాతం జనాభాలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆధునిక పరికరాలు, వివిధ ఆయుధాలైన ఎస్ఎల్ఆర్, ఏకే 47, ఎంపీ5కే, టియర్ గ్యాస్ గన్స్ వీపీ జాకెట్ల పనితీరును ఆర్మ్‌డ్ రిజర్వు విధులను వివరించారు. సాంకేతిక ప్రదర్శన, క్లూస్‌టీమ్, కమ్యూనికేషన్ వ్యవస్థ, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ వంటి కీలక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, నేరస్తులను గుర్తించే విధానాన్ని డెమో చేసి ఎస్పీ సమక్షంలో చూపించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అటువంటి నేరాలకు గురైతే 1930కు కాల్‌చేసి జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకతాయిల బారి నుంచి రక్షణ కోసం 112కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అడ్మిన్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం డీఎస్పీ ప్రసాద్, ఎస్‌టీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, ఏఆర్ ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, దిలీప్, అనేక మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఆయుధాలను తిలకిస్తున్న విద్యార్థులు

మార్షల్ ఆర్ట్స్‌లో



కరాటే, బాడీబిల్డింగ్, కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ... ఈ క్రీడాంశాల్లో అతడికి అతడే సాటి... పోటీ ఎక్కడైనా పతకం అతడిదే.... గ్రామీణ ప్రాంతంలో పుట్టిన ఈ యువకుడు మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్. అతడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గుత్తాల రారాజు. క్రీడలు, వ్యాయామంపై ఉన్న ఆసక్తే అతడిని ఈ స్థాయికి తీసుకెళ్లింది.



రారాజు

- నిరంతర సాధనతో సత్తాచాటుతున్న లంకాఫ్ ఠాణేలంక యువకుడు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 14 పతకాలు కైవసం
- విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

మారుమూల లంక గ్రామమైన లంకాఫ్ ఠాణేలంకలో వ్యవసాయ కుటుంబానికి చెందిన గుత్తాల లక్ష్మీనారాయణ-పళ్లాలమ్మ దంపతుల నాలుగో మగ సంతానం రారాజు. తండ్రి ఇటీవలే మృతి చెందాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న రారాజుకు కరాటేపై మక్కువ. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కరాటేలో సాధన చేస్తున్న యువకులను చూసి దానిపై ఆసక్తి పెంచుకున్నాడు. తొలుత రాజుపాలేనికి చెందిన వీవీఎస్ వర్మ, పల్లిపాలేనికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాస్, అయినాపురానికి చెందిన చిక్కాల పనసయ్య వద్ద శిక్షణ పొందాడు.మెళకువలు తెలుసుకుని బంగారు, రజత పతకాలు సాధించాడు. బాడీబిల్డింగ్‌లో ఛాంపియన్‌గా నిలిచి రజత పతకాలు గెల్చుకున్నాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. కిక్ బాక్సింగ్‌లో బ్లాక్ బెల్ట్ పొంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశం వచ్చినా వదిలి తాను నేర్చుకున్న విద్యను పలువురికి అందించాలని 2019లో ముమ్మిడివరంలో రారాజు జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించాడు. జిల్లాలో వందలాది మందికి శిక్షణ ఇచ్చాడు. ప్రస్తుతం అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో తన జిమ్ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్, ఆరోగ్యకరమైన అంశాలను తెలియజేస్తున్నాడు. ఆపదలో తమను తాము ఎలా రక్షించుకోవాలనే నేర్పుతున్నాడు.

ముమ్మిడివరంలో త్వరలోనే జిమ్, స్పోర్ట్స్ అకాడమీ స్థాపించేందుకు స్థలాన్ని కూడా సేకరించాడు. అందుకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, ఆర్థిక భరోసా కోసం రారాజు ఎదురు చూస్తున్నాడు.



స్వీయ రక్షణపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రారాజు



చిన్నప్పటి నుంచీ నాకు క్రీడలంటే ఆసక్తి ఉండేది. వాటిపైనే దృష్టి పెట్టాను. వివిధ పోటీల్లో పాల్గొన్నాను. దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల నుంచి మెళకువలు నేర్చుకున్నారు. విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇస్తున్నాను... రారాజు

సాధించిన పతకాలు ఇవే...

2011: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2012: కోనసీమ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం
2013: రాజమహేంద్రవరంలో జరిగిన స్టేట్ స్టైలిష్ ఇన్విటేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం.
2014: రాజమహేంద్రవరంలో జరిగిన 8వ స్టేట్ ఓపెన్ కరాటే-కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో రజత పతకం
2014: విశాఖలో జరిగిన 35వ స్టేట్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2014: గాజువాకలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్, సుమన్ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2015: విశాఖలో జరిగిన 12వ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: విశాఖలో జరిగిన 18వ ఆలిండియా వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2015: కాకినాడలో జరిగిన 4వ ఏపీ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం.
2016: విశాఖలో జరిగిన వడాకీ కరాటే చాంపియన్‌షిప్‌లో రజత పతకం.
2016: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో బంగారు పతకం.
2018: గుంటూరులో జరిగిన 2వ ఏపీ స్టేట్ హిటో జపాన్ షాడోకాన్ కరాటే ఇన్విటేషన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం.





పతకాల రారాజును అభినందిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ (పాత చిత్రాలు)

ఉద్యోగులు ప్రజాసేవలో ముందుండాలి

ఆర్టీసీ జోన్-2 ఈడీ విజయరత్నం.. హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్ ప్రారంభం



హెవీ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఈడీ విజయరత్నం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని విజయవంతం చేసినందుకు ఉద్యోగులందరినీ అభినందిస్తున్నామని, అదే ఉత్సాహంతో ఉద్యోగులు ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఆర్టీసీ విజయవాడ జోన్-2 ఈడీ జి.విజయరత్నం అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన హెవీ డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యారేజీ ఆవరణలో మొక్క నాటారు. డిస్పెన్సరీ, బస్‌స్టేషన్, కార్గో కౌంటర్, గ్యారేజీ, డిపో మేనేజర్ కార్యాలయం, ఎర్నింగ్ సెక్షన్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందబోయే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ కె.మాధవ, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) శేషారావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేకు పరిశోధనా ప్రాజెక్టు మంజూరు

జేఎన్టీయూకే, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ రూ.2.81 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టును కాకినాడ జేఎన్టీయూకు మంజూరు చేసినట్టు రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఏఐ డ్రివెన్ సొల్యూషన్ ఫర్ ఆటోమేషన్ ఆఫ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ రెమిడియేషన్ అనే శీర్షికతో ఈ ప్రాజెక్టు రెండేళ్లలో అమలుకానుంది. సైబర్ ముప్పులను గుర్తించడం, వాటి నివారణలో ఆటోమేషన్ సాధించడం, దేశీయ డిజిటల్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత రూపకల్పనను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యమన్నారు. దీనికి సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి ప్రధాన పరిశోధకుడిగాను, డాక్టర్ టి.శివరామకృష్ణ సహ పరిశోధకుడిగాను వ్యవహరిస్తారని తెలిపారు. ఈ బృందం దేశంలోని సైబర్ సెక్యూరిటీ సంస్థలతో సమన్వయం సాధించి ప్రాజెక్టు ఫలితాలను జాతీయ భద్రతా అవసరాలకు అనుగుణంగా ఉండేలా పనిచేయనుంది. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ప్రధాన పరిశోధకుడు, సహ పరిశోధకుడిని అభినందించారు.

సత్యదేవుడి తెప్పోత్సవానికి పంటు ట్రైల్ రన్



పంటుకు ట్రైల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 2న జరిగే సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే పంటుకు గురువారం దేవస్థానం, ఇరిగేషన్ అధికారులు ట్రయిల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం మరోసారి ట్రయిల్‌రన్ నిర్వహిస్తామని విద్యుత్ విభాగ డీఈ సత్యనారాయణ తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యాయని విజయవంతంగా పంపా సరోవరంలో మూడుసార్లు తిరిగిందని డీఈ తెలిపారు. త్వరలో పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతామన్నారు.

అన్నదానానికి రూ.2.10 లక్షలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.2.10 లక్షలు విరాళంగా సమర్పించారు. వేమగిరికి చెందిన పేరూరి శ్రీనివాసరావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.



విరాళం అందజేస్తున్న పేరూరి శ్రీనివాసరావు

ఇసుక దందాకు అడ్డేది..?

- పురుషోత్తపట్నం, గుండాల గోదావరి నదీ ప్రాంతాల్లో తవ్వకాలు
- తెలంగాణకు తరలింపు
- సరిహద్దుల్లో నిల్వలు
- బోర్డర్ దాటుతున్న ఆంధ్ర ఇసుక
- చోద్యం చూస్తున్న అధికారులు



పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో ఇసుక తవ్విన దృశ్యం, తాత్కాలిక బాట

ఎటపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో గోదావరి నదీ ప్రాంతాలే లక్ష్యంగా చేసుకుంటూ కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక దందాను నడిపిస్తున్నారు. ప్రధానంగా పురుషోత్తపట్నం, గుండాల, గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, ఎటపాక, తదితర గోదావరి నదీ ప్రాంతాల్లో తాత్కాలిక ర్యాంపులు ఏర్పాటు చేస్తూ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో ఇసుక అక్రమార్కులకు వరంగా మారుతోంది. పక్కనే అనుకుని(తెలంగాణ) భద్రాచలం పట్టణం ఉండడంతో ఇసుక అక్రమార్కులకు మరింత కలిసోస్తోంది.. దీంతో ఎటపాక మండలంలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. రాత్రి వేళల్లో నదీ ప్రాంతాల్లో నిఘా వేస్తూ ఏంచక్కా ఇసుక దందాను చక్క బెడుతున్నారు. అందిన కాడికి ఇసుకను దండుకుంటున్నారు.. యథేచ్ఛగా ఆంధ్రా ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తూ....



తెలంగాణలోని భద్రాచలం పట్టణంలో అమ్మకాలు చేస్తూ సొమ్ములు గడిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలువరించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలువినిపిస్తున్నాయి.ఈ క్రమంలో పురుషోత్తపట్నంలో వారం రోజులుగా అక్రమార్కులు రాత్రుళ్లు తవ్వకాలు చేస్తూ ఇసుకను భద్రాచలం తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నడిపిస్తున్నారు. తెల్లవారే వరకు ఈ దందా నడుస్తుంది. ఆంధ్రాలో తవ్వకాలు చేపడతూ... తెలంగాణలో అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌లోడ్‌ఇసుకను తెలంగాణలో రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయిస్తున్నారు. ఇదేకాక అక్రమార్కులు గోదావరి ప్రాంతాల నుంచి తవ్వకాలు చేసిన ఇసుకను సరిహద్దు ప్రాంతాల్లో నిల్వలు ఉంచుతున్నారు. ముఖ్యంగా ఎటపాకలోని ఓ ప్రయివేట్ ట్రాక్టర్ షోరూం పక్కన, ఇదే ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద, రాజుపేట సమీపంలో పలు చోట్ల, ఇసుక నిల్వలు పెడుతూ అర్థరాత్రుళ్లు ఆంధ్రా సరిహద్దును దాటిస్తున్నారు. టిప్పర్ లోడ్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, ట్రాక్టర్ దూరాన్ని బట్టి రేటు రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఈ దందా అంతా రాత్రి సమయంలోనే చక్కబెడుతున్నారు.తెల్లవారే సరికి దందా చేసినట్టు ఆనవాళ్లు కూడా కన్పించకుండా చేస్తారు. ఇసుక దందా నిరంతరం జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు కన్నెత్తయినా చూడడంలేదని విమర్శలు విన్పిస్తున్నాయి. కాగా బుధవారం అర్ధరాత్రి పురుషోత్తపట్నం గోదావరి నదీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో రెవెన్యూ అధికారులు సరిహద్దులోని సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద నిఘా పెట్టారు.ఆంధ్రాలోని పురుషోత్తపట్నం నుంచి ఇసుక లోడ్ వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పురుషోత్తపట్నం గ్రామస్థుల్లో కొందరు ఈ దందా నడిపిస్తున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది.ఈ విషయమై తహశీల్దార్ కారం సుబ్బారావును వివరణ కోరగా పురుషోత్తపట్నం నదీ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపినట్టు సమాచారం అందిందని, దాంతో గురువారం ఆ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు యంత్రాలతో కందకాలు తవ్వినట్టు చెప్పారు. అలాగే రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం



పాశుపతాభిషేకం నిర్వహిస్తున్న రుత్వికులు

పిఠాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంత్యుత్సవాల్లో రెండో రోజైన గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి.ఉదయం శ్రీపాదశ్రీవల్లభుడికి సహస్ర లింగార్చన, మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం జరిపారు. సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్ర హోమం, దత్త మూలమంత్ర హోమం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు.ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు రుత్వికులు ప్రత్యేక పూజలు, గో పూజ నిర్వహించారు.ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసన్న దేవస్థానానికి వీల్‌ఛైర్ బహూకరణ

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి విజయవాడకు చెందిన భాష్యకార చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు వీల్‌ఛైర్‌ను బహూకరించారు. రూ.20వేలు విలువగల ఈ వీల్‌ఛైర్‌ను భక్తుల సౌకర్యార్థం ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఏసీ అందజేశారు.

వంద రోజుల కార్యాచరణను పక్కాగా అమలు చేయాలి

కరప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నిర్దేశించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేసి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. కాకినాడ జిల్లా కరప జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సిలబస్ పూర్తి, విద్యార్థుల ప్రగతి, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ప్లానింగ్‌తో పరీక్షలకు ప్రిపేరై మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం మెయిన్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని, వర్క్ బుక్స్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ నాగమణి

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో సాయిదుర్గకు కాంస్యం




అంబాజీపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన కె.సాయిదుర్గ బ్రాంజ్ మెడల్ సాధించినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో సాయిదుర్గ అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయిదుర్గను పలువురు అభినందించారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషనులో 'యాత్రి సువిధా కేంద్రా'

- రద్దీ సమయంలో హైరానాకు చెక్
- ఢిల్లీలో విజయంతో మరిన్ని ఏర్పాటు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- ద.మ.రైల్వే జోన్‌లో రాజమండ్రి ఎంపిక

రాజమహేంద్రవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ని ప్రయాణికుల నిర్వహణ కోణంలో మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రయాణికులు పోటెత్తినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండడమే ప్రధాన ఉద్దేశంగా ఢిల్లీ మాదిరిగా ప్యాసింజర్స్ హోల్డింగ్ ఏరియాలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించనున్నారు. ఈ 'యాత్రి సువిదా కేంద్రా'లను దీపావళి, ఛత్‌పూజా సందర్భంగా ప్రయాణికుల నియంత్రణలో భాగంగా ఢిల్లీలో నిర్మించి విజయం సాధించారు. దీంతో 16 రైల్వేజోన్లలోని 76 రైల్వే స్టేషన్లలో వీటిని 2026 పండుగల సీజన్‌లోపుగా పూర్తిచేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ జాబితాను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాచిగూడతోపాటు రాజమండ్రి రైల్వేస్టేషను కూడా ఉంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో భద్రత దగ్గర నుంచీ సదుపాయాల వరకూ ఇబ్బందులు పడకుండా, అప్పటికప్పుడు హైరానా లేకుండా చేయడమే 'యాత్రి సువిధా కేంద్రా'ల ముఖ్య లక్ష్యంగా చెప్పవచ్చు. దీనిలో భాగంగా ఆయా ప్రదేశాల్లో టికెట్ కౌంటర్లు, ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలు, ఉచిత తాగునీరు, వేచి ఉండడానికి ఏర్పాట్లు, ఆడ, మగ వారికి విడివిడిగా వాష్‌రూమ్స్, సీసీ కెమెరాలు, విచారణ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, అనౌన్స్‌మెంట్ సిస్టం తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. ఒకవేళ రైలు రాక ఆలస్యమైనా ఇబ్బందులు పడకుండా, అందరూ ఒకేచోట గుమిగూడడం, ప్లాట్‌ఫామ్‌లపై రద్దీ ఉండడం, రైలు వచ్చినప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉరుకులు పరుగులు పెట్టడం వంటి సమస్యలకు ఈ హోల్డింగ్ ఏరియాతో చెక్ పెట్టనున్నారు. ప్రస్తుతం రాజమండ్రి రైల్వేస్టేషను గుండా రోజుకు సుమారు 40వేల మంది ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సంఖ్య ప్రత్యేక దినాల్లో రెట్టింపు అవుతుంది. ఆ సమయంలో రైల్వే ప్లాట్‌ఫామ్‌లు కిక్కిరిసిపోతున్నాయి. భద్రత కత్తిమీద సాముగా మారుతోంది. రానున్న పుష్కరాలకు రోజుకు ఈ రైల్వేస్టేషను ద్వారా దాదాపు 1.50లక్షల మంది ప్రయాణించవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యాత్రి సువిధా కేంద్రా నిర్మాణం ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. విధివిధానాలు స్థానిక అధికారులకు అందాల్సి ఉంది. ఢిల్లీలో 7వేల మంది ప్రయాణికులకు సరిపడా హోల్డింగ్ ఏరియాను అభివృద్ధి చేసి 150 వాష్‌రూమ్స్, టికెట్ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేయడంతో వేలాది మంది ప్రయాణికులను సులభంగా హ్యాండిల్ చేయగలిగారు. దీంతో యాత్రి సువిధా కేంద్రాలు మరిన్ని స్టేషన్లలో అవసరమని గుర్తించారు. ఆ జాబితాలో రాజమండ్రి ఉండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




ఆకాశంలో రెడ్ అలర్ట్

యానాం ఫెర్రీరోడ్డులోని రాజీవ్‌గాంధీ బీచ్ గోదావరి ఒడ్డున ఆకాశం ఎర్రబడింది. గత నాలుగు రోజులుగా మొంథా తుఫాన్‌తో మురిసి ఉన్న ఆకాశం గురు వారం సూర్యుని రాకతో సూర్యాస్తమ సమయంలో ఆవిష్కృతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.
-యానాం-ఆంధ్రజ్యోతి

పోలవరం కాలువలో పడి వ్యక్తి మృతి


చరణ్ మృతదేహం

గోకవరం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పోలవరం కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్ళపల్లి చరణ్(20), మన్యం వెంకటేష్, ఆరుగుల్లి సతీష్ కలిసి అచ్చుతాపురం-తంటి కొండ గ్రామ సమీపంలో ఉన్న పోలవరంకాలువలో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈక్రమంలో కాలువ దాటుతుండగా నీటి ఉధృతికి చరణ్ కొట్టుకుపోయాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో వారు రంగప్రవేశం చేసి నాటు పడవ సహాయంతో ఈతగాళ్ళను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్ మృతదేహాన్ని ఈతగాళ్లు కాలువ నుంచి బయటకు తీసికొచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెదురుపాక గ్రామానికి చెందిన దూళ్లపల్లి దుర్గ, నాగమణి దంపతులకు కుమారుడు చరణ్‌తోపాటు ఇద్దర కుమార్తెలు ఉన్నారు. దుర్గ గోకవరంలో మొక్కజొన్న పొత్తులు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్‌కు ఆరు నెలలు క్రితమే వివాహమైనట్టు సమాచారం.

యువకుడి మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రెండ్రోజుల క్రితం సముద్రంలో గల్లంతైన ఓ మత్స్యకార యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరాం (21) భార్య మీనాక్షి, ఒక కుమారుడు ఉన్నారు. ఆ యువకుడు ఓ బోటుపై పనిచేస్తూ చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో స్థానిక కుంబాభిషేకం రేవు వద్ద బోటును సహచరుల సహాయంతో లంగర్‌వేసి నిలుపుదల చేశాడు. అయితే ఆ సమయంలో తుఫాను తాకిడి ఉధృతంగా ఉండడంతో బోటును మరింత భద్రత ఉండే ప్రదేశంలో నిలుపుదామన్న ఆలోచనతో స్థానిక ఏటిమొగ కల్వర్ట్ వద్ద నిలుపుదామన్న ఆలోచనతో మంగళవారం సహచరులతో కలిసివెళ్లి లంగరు తీస్తున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన పెద్ద అల సాయిరాంను సముద్రంలోనికి లాగేయడంతో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు గాలింపులు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ దొరకలేదు. గురువారం కుంభాభిషేకం సమీపంలోకి జీఎంఆర్ పవర్‌ప్లాంట్ వద్ద సాయిరాం మృతదేహం పోలీసులకు లభ్యమయ్యింది. అనంతరం పోర్టు సీఐ సునీల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు వెళితే ఇంటిని దోచేశారు

కాకినాడరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌మండలం తూరంగికి చెందిన డి.శ్రీనివాసరావు రిలయన్స్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాడు. బుధవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బీరువాలో పెట్టిన 17 గ్రాముల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు చోరీకిగురయ్యాయని, బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగి..తగ్గి..పెరుగుతూ
'ఏలేరు'కు భారీగా ఇన్‌ఫ్లో

- కాలువలకు 8,675 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- పొంచి ఉన్న భారీ వరద ముంపు ప్రమాదం
- రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు కరవు


గొల్లప్రోలు కాలువ వద్ద ఏలేరు వరద నీటి ఉధృతి


ఏలేరు నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏలేరుకు భారీగా వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోస్ రైతులు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉదయం ఒకేసారి భారీగా పెరిగి మరలా తగ్గుతూ వచ్చి సాయంత్రానికి మరోమారు పెరగడంతో దిగువకు భారీగా వరద జలాలు విడుదల చేయక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే జరిగితే వేలాది ఎకరాలు ముంపునకు గురికావడంతో పా టు గ్రామాల్లోకి ఏలేరు వరద నీరు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి.

పిఠాపురం/ఏలేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి పెరుగుతున్న ఇన్‌ఫ్లోస్ 10గంటల సమయంలో ఒక్కసారి 38వేల క్యూసెక్కులకు చేరడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. తదనంతరం తగ్గుతు, పెరుగుతూ మధ్యాహ్నం 12, సాయంత్రం 5గంటల సమయంలో 16-12వేల క్యూసెక్కులకు తగ్గిందని ఊపిరి పీల్చుకునే సమయంలోనే సాయంత్రం 6గంటలకు మరోసారి ఇన్‌ఫ్లోస్ 23,600 క్యూసెక్కులకు చేరాయి. దీంతో ఉదయం 6గంటలకు 85.39 మీటర్లుగా ఉన్న నీటిమట్టం 85.67మీటర్లకు చేరగా, నీటినిల్వలు 21.74 టీఎంసీలు నుంచి 22.30 టీఎంసీలకు పెరిగాయి. గరిష్ట నీటిమట్టం 86.56మీటర్లు కాగా నీటిని 24.11 టీఎంసీల వరకూ నిల్వ ఉంచే అవకా శం ఉంది. ఇదే జరిగితే ఇన్‌ఫ్లోస్ ఎంత వస్తే అంతా దిగువకు విడుదల చేస్తారు.

అవుట్‌ఫ్లోస్ పెంపు

ఉదయం 4,675 క్యూసెక్కులుగా ఉన్న నీటి విడుదలను 10గంటలకు 5,675 క్యూసెక్కులకు పెంచగా, 11 గంటలు దాటిన తర్వాత 7,175 క్యూసెక్కులకు, రాత్రి 9 గంటలకు 8,675 క్యూసెక్కులకు చేరుకుంది. ఏలేరు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుతున్న తరుణంలో నీటి విడుదల రాత్రి ఏ సమయంలోనైనా 10వేలు క్యూసెక్కులకు, అప్పటికి ఇన్‌ఫ్లోస్ తగ్గకుంటే 15వేల క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. మొంథా తుఫాన్ దృష్టిలో ఉంచుకుని ఏలేరు రిజర్వాయర్ ఉన్న నీటిని దిగువకు విడుదల చేయడంతో భారీగా ఇన్‌ఫ్లోస్ వచ్చినా వెంటనే భారీగా నీరు విడుదల చేసే పరిస్థితి తప్పిందని వారు తెలిపారు.

పంపా రిజర్వాయర్‌కు పెరిగిన నీటిమట్టం

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయర్‌కు ఎగువప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటివరకు 99 అడుగుల నీటిమట్టం గురువారం 101 అడుగులకు చేరింది. 1700 క్యూసెక్కులు నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా వరద కాలువ, స్పిల్‌వే నుంచి 1650 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. పుష్కర అక్విడెక్ట్‌వద్ద పనులకు ఆటంకం కలుగకుండా గట్టును కొంతమేర తగ్గించడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు పేర్కొన్నారు.


పంపా రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న దృశ్యం


కోతకు గురైన సముద్ర తీరం

- కెరటాల ఉధృతికి తలపంటిపేట తీరంలో పదిమీటర్ల మేర కోత


తలపంటిపేట తీరంలో సముద్రంకోతకు గురైన దృశ్యం

తొండంగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని సముద్ర తీరం పలుచోట్ల పదిమీటర్ల మేర కోతకు గురైంది. మొంథా తుఫాను నేపథ్యంలో కెరటాల ఉధృతికి తీరం నుంచి ఒడ్డుకు సుమారు పది మీటర్ల మేర కోత వేసింది. తలపంటిపేట తీరంలో గురువారం ఉదయానికి ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడి తీరంలో హుకుంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ కార్యకలాపాలు సాగిస్తుంటారు. వారు చేపలు ఎండబెట్టుకునే ప్లాట్‌ఫాం కూడా కెరటాల ఉధృతికి ఛిన్నాభిన్నమైంది. సమీపంలోని హేచరీల నిమిత్తం వేసిన పైప్‌లైన్లు భూమి మట్టానికి వేయ గా వాటి కింద ఉన్న ఇసుక కూడా కోతకు గురికావడంతో పైపులు కర్రలపై వేలాడుతూ కనిపిస్తున్నాయి.

అక్కడా.. ఇక్కడా.. గోదారే..


గోకవరంలో నీటమునిగిన దేవీపట్నం పునరావాస కాలనీ

దేవీపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుతో గోదావరి ముంపునకు గురైన దేవీపట్నం నుంచి గోకవరం గ్రామశివారు గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఒక పునరావాస కాలనీగా ఏర్పడింది. ఈ పునరావాస కాలనీ నిర్మాణ పనులు గత ప్రభుత్వం మొదలుపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంకా పూర్తికాలేదు. వర్షాకాలంలో కాలనీ చుట్టూ వర్షపునీరు చేరి గోదావరిని తలపిస్తోంది. దీంతో కాలనీలో నివశిస్తున్న నిర్వాసితులు గోదావరి ముంపు నుంచి దూరంగా తీసుకువచ్చిన అధికారులు ఇక్కడ వరద ముంపునకు గురయ్యేలా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడా గోదారే ఇక్కడా గోదారే అన్నట్లుగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతంలో కాలనీ నిర్మించడంతో వర్షపునీరు ఈ కాలనీలోకి చేరుతుంది. మెట్టప్రాంతంలో నిర్మించాల్సిన కాలనీ ఇలా లోత ట్టు ప్రాంతంలో నిర్మించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కాలనీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి వర్షపునీరు నిల్వఉండకుండా సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీనివాస్ హత్యకు ఆడియో లీక్ కారణమా..

- ఐదుగురిపై కేసు నమోదు
- పరారీలో నిందితులు


కంచిపల్లి శ్రీనివాస్ (పాతచిత్రం)

అమలాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్యకు దారితీసిన పరిస్థితులపై అమలాపురం పట్టణ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. శ్రీనివాస్ హత్యకు, ఆడియో లీక్‌కు సంబంధం ఏమైనా ఉందా అనే కోణంలోను విచారణ చేపట్టారు. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం తొలుత శ్రీనివాస్ అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ మృతదేహం 29వ తేదీన పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో గుర్తించామన్నారు. దాంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో హత్య కేసుగా మార్పుచేశామని వివరించారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖవ్యాపారి గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు), అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, కారు డ్రైవర్ భాస్కర్ల ప్రసాద్, రావులపాలేనికి చెందిన అనిల్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామన్నారు. మృతుని భార్య దేవి తెలిపిన సమాచారం ప్రకారం తన భర్త శ్రీనివాస్ 25వ తేదీ సాయంత్రం వరకు పట్టణానికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతోనే ఉన్నట్టు ఫోన్ సంభాషణల ఆధారంగా చెప్పారు.పాతకక్షల నేపథ్యంలోనే ముందస్తు వ్యూహంతో అప్పన్నే శ్రీనివాస్‌ను వారికి అప్పగించిఉంటాడని భావిస్తున్నారు.

ఆడియో లీకే హత్యకు కారణమా..

ఈ కేసులో ప్రధాన నిందితుడైన గంగుమళ్ల కాసుబాబుతో మృతుడు శ్రీనివాస్‌కు తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగిందని ఆడియో రికార్డింగును బట్టి తెలుస్తోంది. వ్యక్తిగత దూషణలకు సంబంధించిన ఆడియో రికార్డింగుచేసి పలువురికి పంపించడంవల్లే హత్యకు దారితీసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ ఘటన జరిగి కొన్ని నెలలు గడుస్తుంది. ఆడియో లీక్‌తో పాటు మరేదైనా బలమైన కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌ను ఎక్కడ హత్య చేశారు. ఏ వాహనంపై గోదారి నదీ పాయ వద్దకు తరలించారు. ప్రధాన నిందితులతో పాటు మరెవరైనా హత్యకు సహకరించారా అన్న కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు. అయితే హత్య జరిగిన రోజు నుంచి ప్రధాన నిందితులు పరారీలోనే ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక బృందాలను నియమించారు. హత్యకు ప్రధాన కారణమైన ఆడియోగా భావిస్తున్న రికార్డింగు వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దా.. దా.. నిన్ను చంపేస్తా అంటూ హెచ్చరించిన మాటలు సైతం ఆడియోలో ఉన్నాయి.

చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం


చొప్పెల్లలో సుడిగాలితో ధ్వంసమైన ఇల్లు

ఆలమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్లలో సుడిగాలి విధ్వంసం సృష్టించి అనేక ఇల్లుకు నష్టం కలిగించింది. గురువారం ఉదయం గోదావరి నదీ నుంచి చొప్పెల్ల లాకుల మీదుగా చొప్పెల్ల నుంచి నవాబుపేట వెళ్లే రహదారిలో ఉన్న పలు ఇళ్లకు నష్టం కలిగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్లతోపాటు పలు చెట్లుకు భారీ నష్టం కలిగింది. ఈటోర్నోటో భారీ గాలులతో విరుచుకుపడింది. ఇది కేవలం వంద అడుగుల పరిధిలో ధ్వంసం చేసుకుంటూ నష్టం సంభవించింది. ఈప్రమాదం జరిగిన తక్షణం సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, వీఆర్వో సూర్యప్రకాష్ తదితరులు అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈప్రమాదంలో అనేక ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు భారీగా ధ్వంసమైనట్లు వారు వివరించారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

రాయవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతిచెందింది. స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి వీధిలో గరగ బాబులు పాడిరైతు ఇటీవల లక్ష రూపాయలు తో గేదెను కొనుగోలు చేశాడు. ఇటీవల గేదెకు లేగదూడ పుట్టింది. పశువులపాక వద్ద నాలుగు కుక్కలు దాడిచేసి లేగదూడను హతమార్చాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందడంతో గేదె పాలు ఇవ్వడం లేదని పాడిరైతు ఆవేదన చెందుతున్నాడు. కుక్కల సమస్యను పై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశాడు.

అనపర్తిలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలో మూడు కాసుల బంగారు తాడు చోరీ


పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు విజయలక్ష్మి

అనపర్తి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి కొప్పవరం రోడ్డులో గురువారం రాత్రి మో టార్ సైకిల్‌పై వెడుతున్న దంపతులను వెంబడించిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకుని వెళ్ళడమే కాకుండా వీరి బైక్‌ను కాలితో తన్నడంతో దంపతులు పంటపొలాల్లో పడ్డారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన వడ్లపూడి విజయలక్ష్మి పనులు చేసుకునేందుకు హైదబాద్ వెళ్ళింది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఆమెను ద్వారపూడిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కించేందుకు భర్త రాఘవ ఆమెను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని కొప్పవరం మీదుగా అనపర్తి వస్తున్నారు. అనపర్తి చేరుకునేసరికి గుర్తు తెలియని వ్యక్తి మరో మోటార్ సైకిల్‌పై వెనుకగా వచ్చి ఆమె మెడలోని చైన్ అందిపుచ్చుకుని వారి మోటార్ సైకిల్‌ను కాలితో తన్నడంతో దంపతులు ప్రయాణిస్తున్న వాహనం పంటపొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాటుకోళ్లు దొంగిలిస్తున్న వ్యక్తుల అరెస్ట్


పోలీసులు అరెస్టుచేసిన నిందితులు

గోకవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాటు కోళ్ళు దొంగిలిస్తున్న నల్గురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబూరావు అనే వ్యక్తి ఇంటి వద్ద పెంచుకుంటున్న నాటుకోళ్ళను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు అందింద న్నారు. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా అదే గ్రామానికి చెందిన అవుల గోపి, కొత్తపల్లి రమేష్, పిల్లల సురేంద్ర, మేడికొండ అనిల్ అనే వ్యక్తులు కోళ్ల దొంగి లించినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేయడంతో పాటు సుమారు రూ.30,000ల విలువ గల నాటు కోళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. నింది తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజమహేంద్రవరం

బిక్కవోలులో 7931 ఎకరాల్లో నేలకొరిగిన వరి


ఊలపల్లిలో కుళ్లిన వరిని పరిశీలిస్తున్న ఏవో శామ్యూల్‌జాన్

పంట నష్టం అంచనాకు రంగంలోకి బృందాలు

బిక్కవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో 15 వేల ఆయకట్టు వుండగా అందులో 7931 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని మండల వ్యవసాయాధికారి ఎస్.శామ్యూల్‌జాన్ గురువారం తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయడానికి టీమ్‌లు వేశామన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి వీఆర్వో, టీఏలను నియమించామని, మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారి ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో సర్వే ప్రారంభించామని తెలిపారు. నష్ట వివరాలు పూర్తిగా అందాక ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మండలంలో గురువారం ఉదయం భారీగా వర్షం కురువడంతో పలు చోట్ల వరి నీట మునిగింది. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2న టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ హాల్ వద్ద రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 2వ తేదీ ఉదయం 9గంటలకు జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తెలిపారు. అండర్-15 బాలబాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని, వీటిలో ఎంపికైన జట్లు నవంబరు 17 నుంచి 20 వరకు విశాఖపట్నంలో జరిగే అంతర జిల్లా రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 2వ తేదీ ఉదయం 8.30 లోగా 93475 86233 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

డీఎల్ఎస్ఏ మోనిటరింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎల్ఎస్ఏ ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి,డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి బి.పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించడానికి నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిపై సమీక్షించారు.త్వరగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్ అర్జీలపై కూడా చర్చించారు.

కాపవరం హైస్కూల్లో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాపవరం ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు మాక్ ఎన్నికలు నిర్వహించారు.విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు,ప్రజాస్వామ్య విలువలు తెలియజేసే క్రమంలో దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ సంస్థ,సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో యాక్టిజన్ క్లబ్ ఏర్పాటు చేశారని, దీనిలో భాగంగా విద్యార్థులకు మాక్ ఎలక్షన్ నిర్వహించినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు.విద్యార్థి అభ్యర్థులు వారి గుర్తును అందరికీ తెలియజేస్తూ వారు చేసే మంచి పనులను వివరించి తమకు ఓటేసి గెలిపించాలని ప్రచారాలు నిర్వహించారు. విద్యార్థులు గుర్తింపు కార్డులతో వచ్చి ఓటింగ్‌లో పాల్గొని 6,7,8 తరగతుల నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరరాఘవరెడ్డి, టీవీఎస్ఎస్ రెడ్డి, ఆచార్యులు, రవికుమార్, కోమలి పాల్గొన్నారు.

కర్ర పెండలం, నర్సరీల పరిశీలన


సింగంపల్లిలో కర్రపెండలం పంటను పరిశీలిస్తున్న అధికారులు

రంగంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో గురువారం కర్ర పెండలం, నర్సరీలను పెద్దాపురం ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త పి.సునీత, ఉద్యాన అధికారి ఎ.నాగదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు జాగ్రత్తలు చెప్పారు. వాలిన కర్రపెండలం మొక్కలను నిలబెట్టాలని చెప్పారు.వేరుపడిన మొక్కలను మట్టితో కప్పిపొలంలో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలని తెలిపారు. ఆకు పిచికారి కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ) 3గ్రాములు, ఒక లీటర్ నీటికి, పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వంకాయ, మిరప, నర్సరీల్లో వ్యాధి నియంత్రణకు కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ) లేదా మెటలాక్సిల్+మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చల నివారణకు కార్బెండిజమ్ 1గ్రాము, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.నర్సరీల్లో జీవక్రిమి నాశకంగా ట్రైకోడెర్మా విరిడి+ పాక్షికంగా కుళ్లిన ఎఫ్‌వైఎంను స్ప్రే చేసిన 10 రోజుల తర్వాత వాడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బంతి, చంద్రమల్లీ, కనకాంబరం మొక్కలపై 13-0-45 5గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పిండి నల్లి, మీలీబగ్స్ నియంత్రణకు అజాదిరాక్టిన్ (నీమ్సారం 3000పీపీఎం) 5మిల్లీలీటర్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చరల్ అధికారి బి నాగదేవిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపాన్ని ఉపేక్షించం


రోడ్డు నాణ్యత పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

తనిఖీలో మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో నాణ్యతాలోపం ఉంటే ఉపేక్షించేదిలేదని మునిసిల్ కమిషనర్ రాహుల్‌మీనా హెచ్చరించారు. గురువారం నగరంలోని దానవాయిపేట, పప్పులు వీధి, పందిరి వారి వీధి, సాయికృష్ణ థియేటర్ రోడ్డు, కంచుమర్తి వారి వీధుల్లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా 25వ వార్డులో ఇటీవల నిర్మించిన ఒక రోడ్డు పరిశీలించి, నిర్మాణంలో నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరలా నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడవద్దని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, ఈఈ మాధవి, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

సీతానగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ముంపు ఘటనలు చోటుచేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కృష్ణనాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన సీతానగరంలోని వంగలపూడి, సింగవరం గ్రామాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులు, వర్షాలకు నేలకొరిగిన పంట భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్వరమే పంట నష్టం అంచనాలను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో భారతి సర్పంచ్ సంగన చినపోశియ్య, కొంచ చంద్రభాస్కర్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

» బాధితులను ప్రభుత్వం అండ
» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
» పలు గ్రామాల్లో పర్యటన


నిడిగట్లలో దెబ్బతిన్న వరి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు/కోరుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన రాజానగరం మండలం కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.ఎర్రంపాలెం, కొత్తతుంగపాడు, పాతతుంగపాడు, కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల పంట నేలకొరిగిందని రైతులు చెప్పారు. నేలకొరిగిన వరిపైరును ఎమ్మెల్యే పరిశీలించారు. పాతతుంగపాడులో దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలించారు. ప్రభుత్వం కర్షకులను అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధిత రైతులను సంప్రదించి నష్టపోయిన పంట నష్టం వివరాలను నమోదు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జె.ఏ. ఝాన్సీ, డిప్యూటీ తహశీల్దారు గంగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కడియం ఆవలో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రైతులకు ప్రభుత్వం అండ: గోరంట్ల

కడియం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. గురువారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కూటమి నాయకులతో కలిసి ఆయన కడియం ఆవ పొలాలను పరిశీలించారు. తుఫాన్‌కు పంట పాడవడం బాధాకరమని, రైతులు అధైర్య పడొద్దని కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందని హామి ఇచ్చారు. అధికారులు పంట ఎంత మేర పాడయింది అనేది నివేదిక తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాదికారి మాదవరావు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, బొర్సు సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు చెలుబోయిన శ్రీను, చిలుకూరి నాగేశ్వరరావు, ఉండమట్ల ప్రభాకర్, వట్టికూటి దత్తుడు, వాశంశెట్టి బాలాజీ, ఎంపీడీవో రమేష్,తహశీల్దారు సునీల్, వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: నల్లమిల్లి

అనపర్తి అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పెదపూడి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. పంట నష్టం అంచనాల పనిలో సిబ్బంది ఉన్నారని నివేదికల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి,జనసేన నాయకుడు రావాడ నాగు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి దేవస్థానాల అభివృద్ధి

హితకారిణి, కోటిలింగేశ్వర దేవస్థానం చైర్మన్ల ప్రకటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి


చైర్మన్‌లను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి దేవస్థానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన నగరంలోని హితకారిణి సమాజం ట్రస్ట్ చైర్మన్‌గా టీడీపీ హెల్త్ విభాగం నేత డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్‌ను, ఉమాకోటిలింగేశ్వర దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్న కొయ్యల రమణలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కమిటీల్లో చైర్మన్లతో పాటు కూటమి నాయకులను 11 మంది చొప్పున నియమించామన్నారు. నగరంలో 14 ఎండోమెంట్ కమిటీలు ఉండగా ఇప్పటి వరకు 12 నియమించామని, త్వరలో చందా సత్రం, శ్రీ గౌతమి జీవ కారుణ్య సంఘం కమిటీలను నియమిస్తామన్నారు.శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్‌ను నియమించినా పునఃపరిశీలనకు వెళ్లిందని ఆదిరెడ్డి వాసు తెలిపారు. కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఐక్యమత్యంతో ఇది సాధ్య మైందన్నారు. ఈ కమిటీల నియామకానికి సహకరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అధ్యక్షుడు వైశ్రీనులకు ఎమ్మెల్యే వాసు కృతజ్ఞతలు తెలిపారు. నూతన నియమితులైన కమిటీ చైర్మన్లను ఎమ్మెల్యే వాసుతో పాటు టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అభినందించారు.

జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతగా స్టిక్ మనోహర్


స్టిక్ మనోహర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ప్రముఖ మెజీషియన్ ఎస్.మనోహరరావు(స్టిక్ మనోహర్) కేరళ రాష్ట్రంలో అలెప్పిలో జరిగిన రెండో జాతీయ మ్యాజిక్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ నెల 25,26 తేదీల్లో జరిగిన ఎంఎంఏ నేషనల్ మ్యాజిక్ ఫెస్ట్-2025లో జూనియర్, సీనియర్స్ పోటీలకు స్టిక్ మనోహర్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేరళ మంత్రి జి.సుధాకరన్, అసోసియేషన్ అడ్వైజర్ ఆర్‌కే మళయాత్ చీఫ్ ప్యాట్రన్ సామ్రాజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మినూ పటేల్, జనరల్ సెక్రటరీ జోసెఫ్ జీబా, మాయాన్ వెదర్‌షా సమక్షంలో స్టిక్ మనోహర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాదులు, మెజీషియన్లు ఆయన్ను అభినందించారు.

ముంపు నివారణకు చర్యలు తీసుకోండి

ఆర్డీవో కృష్ణనాయక్.. శ్రీరంగపట్నంలో పర్యటన.. నిత్యావసర సరుకుల పంపిణీ


శ్రీరంగపట్నంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, ఆర్డీవో కృష్ణనాయక్



కోరుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ముంపు ఘటనలు చోటు చేసుకోకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్ అధికారులను ఆదేశించారు.గోకవరం మండలం అచ్యుతాపురం వద్ద చెరువుకు గండి కొట్టడం వల్ల కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో బురద కాలువ నీరు పొంగి ప్రవహించిన పరిస్థితులను గురువారం సాయంత్రం ఆర్డీవో ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఆయన గ్రామస్థులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే రుడా చైర్మన్ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి గ్రామానికి చేరుకొని అక్కడి పరిస్థితులను పర్యవేక్షించి తక్షణమే సహాయక రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.ఇదిలా ఉండగా గ్రామస్థులెవరూ వాగును దాటకుండా సీఐ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు.

స.హ.చ అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోండి

గార్డ్స్ షర్ ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం అమలు చేయని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గార్డ్స్ షర్ ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు కోరారు. గురువారం ఆయన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనాను ఆర్‌టీఐ జాతీయ మహిళ కన్వీనర్ ఆకుల విజయభారతి, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధరరావులతో కలిసి సమస్యను వివరించారు. సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని సెక్షన్లు పరంగా వివరించారు. తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్యసాయి శతవర్షజయంతి ఉత్సవాలకు మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతవర్ష జయంతి సందర్భంగా వచ్చేనెల 13 నుంచి 25వరకు జరిగే ఉత్సవాలకు రావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. గురువారం రాజమహేంద్రవరంలో మంత్రిని కలిసి ఆహ్వానపత్రం అందించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాని మోదీతో పాటు సుమారు 200 దేశాల నుంచి దాదాపు 15లక్షల మంది భక్తులు హాజరవుతారని తమకు తప్పక ఉత్సవాల్లో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని కోరారు. కాగా తప్పనిసరిగా వస్తానని మంత్రి దుర్గేష్ వారికి చెప్పారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజానగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.6,45,922 సొమ్ముకు సంబంధించిన చెక్కులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి గురువారం బాధిత కుటుంబాలకు అందజేశారు. మండలంలోని నామవంలో కోమలి శ్రీనివాసరావు, జి.ఎర్రంపాలెంలో గుర్రం ప్రసాద్, రాధేయపాలెంలో వన్నుం పోతురాజు, గోశాల ప్రకాశరావు, పల్లకడియంలో టేకుమూడి దుర్గారావు, పరిజెల్లపేటలో యాడవిల్లి అమ్మారావు, గల్లా చక్రమ్మ, మన్యం సూర్యనారాయణ, శ్రీకృష్ణపట్నంలో దక్షరపు రమణ,కొప్పన పద్మలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి బీవీఆర్ అందజేశారు.కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, మద్దిరెడ్డి చిన వెంకటేశ్వరరావు, మల్లారపు సత్యానందం, చిట్టిప్రోలు పద్దరాజు, ఎన్. శామ్యూల్, డి.నాగమునీశ్వరరావు పాల్గొన్నారు.


రాధేయపాలెంలో చెక్కు అందజేస్తున్న బీవీఆర్ చౌదరి

దేశ నిర్మాణంలో నైతిక అప్రమత్తత ప్రధానం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో నైతిక అప్రమత్తత, జవాబుదారీతనం ప్రాముఖ్యమైనవని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అన్నారు. గురువారం రాజమహేంద్రరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. గెయిల్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సమగ్రత, పారదర్శకత, నైతిక విలువలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. గెయిల్ ఇండియా మేనేజర్ హెచ్‌ఆర్ వైవీఎస్ మూర్తి, మాజీ మేనేజర్ ఎన్ఎస్ శర్మ, అధికారులు, కళాశాల ఐక్యూఏసీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సీపీ బ్రౌన్ జయంతి నిర్వహణ నిర్ణయంపై హర్షం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన సీపీ బ్రౌన్ జయంతిని ఏపీ ప్రభుత్వం పండుగలా నిర్వహించాలని నిర్ణయించడం, తెలుగు భాషాభిమానులకు అసలైన పండుగని సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. బ్రిటిష్ పాలనలో రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా మేజిస్ట్రేట్‌గా చేసిన బ్రౌన్ సేవలు మరువరానివని, ప్రభుత్వం రాజమహేంద్రవరంలో బ్రౌన్ విగ్రహాన్ని స్థాపించాలని ఆయన కోరారు.

శీలా వీరభద్రుడు జయంతి



రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యవస్థాపకుడు శీలా వీరభద్రుడు జయంతి సందర్భంగా వీరభద్రుడు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు బీరా రాజు, పూర్ణిమ ప్రసాద్, కనకం నాగేశ్వరరావు, పల్లా వెంకటేశ్వరరావు, సీఈవో విజయప్రతాప్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్.. అన్నక్యాంటీన్ల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని అన్నా క్యాంటీన్లను నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా గురువారం తనిఖీ చేశారు. సాయంత్రం శేషయ్యమెట్ట, క్వారీ మార్కెట్ సెంటర్ల వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను తనిఖీ చేసిన కమిషనర్ అక్కడ భోజనాలు చేస్తున్న వారితో మాట్లాడి ఆహార నాణ్యతపై ఆరా తీశారు. అలాగే మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఉండాలన్నారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు కడిగే ప్రదేశాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, పాత్రలు, ప్లేట్లు వేడి నీటితో కడగాలన్నారు. క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 31 అక్టోబరు 2025 | 5



పంట నష్టం పెంచారు.. రైతుకు ఊరటనిచ్చారు..

రాజమహేంద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల వ్యవసాయ ఉద్యాన వన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.జిల్లాలో 1257 మంది రైతులకు చెందిన 20,385 హెక్టార్లలో నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా.జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి 1744 మంది రైతులకు సంబంధించిన 1008.90 హెక్టార్ల అరటి పంట నష్టపోయింది.153మంది రైతులకు చెందిన 68.96హెక్టార్లలో కూరగాయలు, ఇద్దరు రైతులకు చెందిన ఒక హెక్టారులో పూల తోట దెబ్బతింది. ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ ఇటీవల పెంచడంతో రైతుకు కొంత ఊరట లభించినట్టే.గతంలో ఎకరాకు రూ.6 వేలు, హెక్టారుకు రూ.15 వేలు మాత్రమే నష్టపరిహారం ఇచ్చేవారు.ఇవాళ ఎకరాకు రూ.10 వేలు,హెక్టారుకు రూ.25 వేలు ఇస్తున్నారు. ఉద్యాన పంట అరటికి హెక్టారు రూ.37 వేలు, కూరగాయలు, పూల పంటకు హెక్టారు రూ.25 వేలు ఇస్తున్నారు.

పంగిడి క్వారీల్లో అధికారుల తనిఖీ

కొవ్వూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో క్వారీల్లో అక్రమంగా 150 అడుగుల లోతు ఖనిజ సంపద తవ్వి, ఆ గోతులను పూడ్చకుండా వదిలివేస్తున్నారు. ఆ గోతుల్లో కొన్నిపరిశ్రమల నుంచి వెలువడే కెమికల్స్, చెత్త గోతుల్లో వేయడం వల్ల గ్రామంలో భూగర్భజలాలు కాలుష్యమవుతున్నాయని గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో ఆర్.సుస్మిత, జిల్లా మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎం.శంకరరావులతో కూడిన బృందం గోతులను పరిశీలించారు.



నిడదవోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం కంసాలిపాలెం- తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య బుధవారం ఎర్రకాలువ నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో రాకపోకలను అధికారులు బంద్ చేశారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొంగువారిగూడెంలోని ఎర్రకాలువకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.



మొంథా తుఫాన్ మిగిల్చిన కష్టం అంతా ఇంతా కాదు.. పక్క చిత్రంలో రోడ్డును చూసి చెప్పేయ వచ్చు. మంగళవారం ఉదయం వరకూ ఇదీ ఉప్పాడ బీచ్ రోడ్డు పరిస్థితి.. తుఫాన్ ఉధృతికి బుధవారం ఉదయానికి ఇలా ముక్కలైపోయింది.. కనీసం వెళ్లడానికి దారిలేకుండా తయారైంది. - ఫొటోగ్రాఫర్- కాకినాడ

మొంథా వర్రీయే!



చివరికిలా : కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో నీట మునిగిన వరిచేను

- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముంచేసింది.. వరి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. తుఫానుకు ముందు రెండు రోజులు అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు చేలల్లో నీరు చేరి పంట దెబ్బతినగా తీవ్ర తుఫాన్‌తో మరింత నష్టపోయింది. రోజుల తరబడి నీళ్లల్లో పంట నానిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.326 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. నష్టం లెక్కింపు కొన సాగుతుండడంతో పెరిగే అవకాశం ఉంది. వరి, ఉద్యాన వన పంటలతో పాటు, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల పొలాలు మునకలో ఉండడంతో యాప్ ద్వారా అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నష్టాల అంచనాలు తేల్చే పనిలో పడ్డాయి.



పెదపూడిలో మొలకలు వచ్చిన వరిపనలు పరిశీలిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

కోనసీమలో రూ.148 కోట్లు

మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 78 వేల ఎకరాల్లో రూ.148 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. 22 మండలాలు, మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీ పరిధిలో జరిగిన పంట నష్టాలు నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా యంత్రాంగాన్ని గురువారం ఆదేశించారు. నష్టాల అంచనాలో అధికార బృందాలు నిమగ్నమ య్యాయి. ఒకట్రెండురోజుల్లో తుఫాన్ నష్టాలను రూపొందించిన కలెక్టర్‌కు నివేదించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రాథమికంగా 31 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. ప్రత్యేక బృందాలను నియమించి నష్టాలను అంచనా వేస్తున్నారు. కౌలు రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో 300 విద్యుత్ స్తంభాలతోపాటు 125 కిలోమీటర్ల పరిధిలో చెట్లు, వివిధ రకాల వృక్షాలు కుప్పకూలాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని నివేదించారు.జిల్లాలో 47 పాఠశాలల్లో డ్యామేజీలు అయినట్టు విద్యాశాఖ అంచనాలు రూపొందించాయి. రానున్న ఐదు రోజుల్లో నివేదికలు రూపకల్పనలు చేసి సమర్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు.



గోపాలపురం మండలం వాదాలకుంటలో రహదారిపై ప్రవహిస్తున్న వాననీరు

వానలు..వరదలు..

తీవ్ర తుఫాన్ తీరం దాటి బలహీన పడి తీవ్ర వాయుగుండగా కొనసాగుతుండడంతో పలుచోట్ల భారీవర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం,సామర్లకోట, యు.కొత్తపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో 3 గంటలకుపైగా భారీగా కుండపోత వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ నిలిపివేశారు. మరో పక్క భారీ వర్షాలతో కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. కాకినాడ-సామర్లకోట రహదారిలో పలుచోట్ల భారీగా నీరు చేరిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. అటు ఏలేరు రిజర్వాయరుకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో కొనసాగు తుండడంతో వరద ముప్పు పొంచి ఉంది. గురువారం ఉదయం ఇన్‌ఫ్లో 38 వేల క్యూసెక్కులకు చేరడంతో అధికారులు బెంబేలెత్తారు. ఇప్పటికే కాలువల ద్వారా నీరు 7 వేల క్యూసెక్కులకు దిగువకు వదులుతుండగా మరింత కిందకు వదిలితే అనేక మండలాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో ఆందోళన చెందారు. కిర్లంపూడిలో ఒక చోట గండిపడడంతో ఇసుక బస్తాలు ఉంచారు. ఏలేరుకు వరద తగ్గుతూ, పెరుగుతూ ఉండడంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ రిజర్వాయరును పరిశీలించారు.అన్నవరంలో పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతోంది.దీంతో తుని రూరల్ పరిధిలోని తిమ్మాపురం శివారున రహదారులపై నీరుచేరింది.

నేటి నుంచి వేటకు ఓకే..

మొంథా తుఫాన్ ముప్పుతో సముద్రంలో చేపల వేటను అధికారులు నిషేధించారు. దీంతో మత్స్యకారులు ఇళ్లకే పరిమితమై ఇబ్బంది పడుతున్నారు.తుఫాన్ ముప్పు తొలగడంతో మత్స్యకారులు శుక్రవారం నుంచి వేటకు వెళ్లవచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలు నేటితో నిలిపివేయనున్నారు.

కాకినాడలో రూ.98 కోట్లు

మొంథా తుఫాన్ జిల్లాలో అన్నదాతను నిలువునా ముంచేసింది. భారీ ఈదురుగాలులు, కుండపోత వానతో వరి వెన్నువిరిచింది. మరికొద్ది వారాల్లో చేతికి రానున్న పంటను చిదిమేసింది.దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు లబోదిబోమంటు న్నారు. తుఫాన్ బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతుండడంతో గురువారం పలు చోట్ల ఏకధాటిగా కుండపోతగా వాన కురిసింది. ఎగువన భారీ వర్షాలతో ఒక వైపు గోదావరి.. మరో వైపు ఏలేరుకు వరద ముప్పు పెరుగుతోంది. మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటడంతో వ్యవసాయశాఖ బుధవారం కాకినాడ జిల్లా వ్యాప్తంగా 368 గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేయగా గురువారం నాటికి ప్రాథమికంగా 50,700 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించారు.ఈ నష్టం విలువ రూ.98 కోట్ల వరకు అంచనా. మొత్తం జిల్లాలో 261 గ్రామాల్లో నష్టం జరగ్గా పంట నష్టపోయిన అన్నదాతలు 33,596 మందిగా గుర్తించారు.ఇది పెరగనుంది. పంట నష్టం అంచనాలు పూర్తయ్యే సరికి వారం పట్టనుంది. అత్యధికంగా పెదపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరి దెబ్బతింది. ధాన్యం తడిచి మొలకలు వచ్చేశాయి. గురువారం పర్యటించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నష్టం తీవ్రతను మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్‌లో వివరించారు. మొక్కజొన్న 200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాల్లో నష్టపోయింది.

- లక్షలాది ఎకరాల్లో మునిగిన పంట
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- జిల్లాల వారీగా బృందాల ఏర్పాటు
- నష్టం అంచనాల్లో అధికారులు
- వారం రోజుల్లో పూర్తి నివేదిక
- అల్పపీడనంతో అక్కడక్కడా వానలు



గోకవరంలో పొలాల పరిశీలనకు కాలినడకన కలెక్టర్ కీర్తి

తూర్పున రూ.80 కోట్లు

మొంథా కష్టమొచ్చింది..భారీ నష్టాన్ని మిగిల్చింది.. తుఫాన్ ప్రభావం కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షాలకు జనజీవనం అస్త వ్యస్తమైంది. జిల్లాలో వివిధ శాఖలకు సంబం ధించి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.107 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.అధికారులు క్షేత్రస్థాయిలో అంచనాల్లో నిమగ్నమయ్యారు.జిల్లాలో 209 గ్రామాలపై తుఫాన్ ప్రభావం చూపినట్టు అంచనా వేశారు. 10,626 మంది నష్టపోయారు. వరికి రూ.80 కోట్లు,అరటి, కూరగాయలు, పూలతోటలకు సంబంధించి సుమారు రూ.3.9 కోట్లు నష్టం జరిగింది. జిల్లాలో 56 గృహాలు దెబ్బతిన్నాయి. 68 రిలీఫ్ సెంటర్లు ఏర్పాటు చేసి, 2718 మందికి పున రావాసం కల్పించారు.18,872 మందికి ఆహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.జిల్లాలో 87.99 కిలో మీటర్ల మేర 48 ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిని రూ.54.57 కోట్ల నష్టం వాటిల్లింది. పంచా యతీ రాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలో మీటర్ల మేర దెబ్బతినగా రూ.45.81 కోట్లు నష్టం వాటిల్లింది.మైనర్ ఇరిగేషన్ వనరులు 21 దెబ్బతి నగా రూ.6.87 కోట్లు నష్టం జరిగింది. 123 వాటర్ ట్యాంక్‌లు డ్యామేజీ అయ్యాయి.జిల్లాలో 429 హెల్త్ సబ్-సెంటర్లు ఉన్నాయి. 251 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖకు రూ.37.34 లక్షలు నష్టం వచ్చినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

తుఫాన్ బాధితులకు సాయమిలా..

తుఫాన్ వల్ల పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలతో పాటు కుటుంబానికి రూ.3 వేలు, ఒంటరి వ్యక్తులకు రూ.వెయ్యి వంతున పరిహారం అందించడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. కాకినాడ తీరప్రాంతంలో ఉన్న 45 గ్రామాల్లో 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. చేనేత కార్మికులకు బియ్యాన్ని అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వీటిని ప్రారంభించి మూడురోజుల్లోగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుని ఇళ్లకు వెళ్లేవారికి ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంట నూనె, పంచదారతోపాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ 50 శాతం రాయితీపై దాణాను పంపిణీకి సిద్ధం చేసింది.

ఉప్పొంగిన బురదకాలువ



కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఊరి మధ్య నుంచి ఉధృతంగా బురద కాలువ



- నీట మునిగిన శ్రీరంగపట్నం
- వీధుల్లో మీదుగా ప్రవాహం
- ఆందోళనలో ప్రజానీకం
- గోకవరంలో పంటలకు నష్టం
- ఆదుకోవాలని డిమాండ్

కోరుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలంలోని లోతట్టు గ్రామం అయిన శ్రీరంగపట్నంను గురువారం సాయంత్రం బురదకాలువ చుట్టిముట్టింది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగి బురద కాలువ మీదుగా వరద నీరు శ్రీరంగపట్నంను చుట్టిముట్టింది. ఉదయం నుంచి బురద కాలువ వరద నీరు వస్తున్నప్పటికీ గ్రామంలోకి రాలేదు. అయితే సాయంత్రం సూరంపాలెం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేసి వరద నీటిని ఒక్కసారిగా దిగువకు విడుదల చేశారు.దీంతో బురద కాలువ వరదనీటి ఉధృతి పెరిగి శ్రీరంగపట్నం గ్రామంలో కాలువ పొంగి ప్రవహించింది. గ్రామంలోని వీధుల్లోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. బురద కాలువ శ్రీరంగపట్నం గ్రామ మధ్య నుంచి ఉండడంతో వరద వచ్చిన ప్రతి సారి గ్రామంపై బురద కాలువ పొంగి విరుచుకుపడడం గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ రాత్రికి వరద మరింత ఎక్కువైతే శ్రీరంగపట్నంలోని యానాదుల పేట, ఎస్సీ పేట, బీసీ కాలనీ, నాలుగు నుంచి ఐదు అడుగుల మేర ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం శ్రీరంగపట్నం గౌరీచౌక్ వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం, రాజీవ్‌గాంధీ విగ్రహాల వద్ద బురద నీరు కాలువపై నుంచి ఆర్ అండ్‌బీ రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఆ వరద నీరు గ్రామంలోని లోతట్టు ప్రాంతానికి చేరింది. అప్పటికప్పుడు అధికారులు, డీఎస్పీ వై. శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది కాలువ పొంగే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి వరద నీటిని అదుపు చేస్తున్నారు. బురద కాలువ వరద నీటి ఉధృతిపై సూరంపాలెం రిజర్వాయర్ అధికారులతో మాట్లాడుతున్నారు.

ఆదుకుంటాం : బత్తుల

మొంథా తుఫాన్ కారణంగా రాజానగరం నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతుకు న్యాయం చేసే ఏర్పాటు చేస్తామన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ నుంచి ఈ రాత్రికి వరద నీరు వదలకుండా ఆపు చేయమని రిజర్వాయర్ అధికారులకు చెప్పామన్నారు.

గోకవరంలో నీట మునిగిన 50 ఎకరాలు

గోకవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల నుంచి దిగువకు వస్తున్న వర్షపు నీటి కారణంగా తంటికొండ- అచ్చుతాపురం మధ్య ఉన్న బురదకాలువ (పెద్ద కాలువ) ఉధృతంగా ప్రవహించి పొంగి పొర్లడంతో సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. సుమారు 50 ఎకరాలకు పైగా వరి పంట నీటి మునిగినట్టు రైతులు చెప్పుకొస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొస్తాయనుకున్న తరుణంలో దెబ్బ తీసింది. తంటికొండ, గాదెలపాలెం, అచ్చుతాపురం, కొత్తపల్లి తదితర గ్రామాలలో పంట పొలాలు నేలకొరగడంతో పాటు, నీట మునిగాయి. వేలాది రూపాయలను పెట్టుబడులుగా పెట్టి సాగు చేసిన పంట నీటి పాలు కావడంతో కర్షకుడు కంటతడి పెడుతున్నాడు. నిండా ముంచిందని వాపోతున్నాడు.

పంట నష్టాలు అంచనా వేయండి



కడియం ఆవలో కలెక్టర్ కీర్తి చేకూరికి పంట నష్టం వివరిస్తున్న అన్నదాత

కడియం/గోకవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథాన్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కడియం, గోకవరం మండలాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. పంటల నష్టం అంచనా నివేదిక తయారు చేసి సకాలంలో సమర్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి దిగువకు వచ్చే వర్షపు నీటి వల్ల గోకవరంలో ముంపుకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించారు.అచ్చయ్యపేట సమీపంలో ఊరకాలువ మూసుకుపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నీటి పారుదల సౌకర్యాలు మెరుగు పర్చేలా తగిన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాణా సెంటర్ వద్ద ఉన్న బ్రిటిష్ కాలం నాటి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా అధికారులు తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అనంతరం తంటికొండలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు స్వయంగా తెలుసుకున్నారు. ఖచ్చితమైన వివరాలు సేకరించి నష్ట నివేదికను హేతుబద్ధంగా సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలన్నారు.అచ్చుతాపురం గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణపనులు పరిశీలించారు. నష్ట పరిహారానికి నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు.ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఆర్డీవో కృష్ణనాయక్, డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నాని, తహశీల్దార్లు రామకృష్ణ, సునీల్‌కుమార్, ఎంపీడీవో గోవింద్, ఏపీవో అప్పలరాజు, కార్యదర్శులు శిరీష, రమణకుమారి ఉన్నారు.

కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశం



బిక్కవోలు మండలం రంగాపురంలో వరిచేలో నిలిచిన నీటిని చూపుతున్న రైతాంగం

పంట నీట మునిగితే ఇలా చేయండి

వ్యవసాయాధికారి మాధవరావు



కాల్దరిలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఉండ్రాజవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు నీట మునిగిన వరి చేలల్లో సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. గురువారం మండలంలోని కాల్దరి, వేలివెన్ను గ్రామాల్లో తుఫాన్‌కు నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వివిధ దశల్లో ఉన్న సార్వా వరికి శాస్త్రీయ పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని సూచించారు. పాలుపోసుకునే దశలో ఉన్న వరి పంట నీట మునిగితే గింజ రంగుమారి దిగుబడి, నాణ్యత తగ్గుతుందన్నారు. గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మాంకోజెబ్ కలిపిన మందును పిచికారి చేయాలని రైతులకు చెప్పారు. గింజగట్టిపడే దశ నుంచి కోత దశ చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుందన్నారు. రైతులు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక నష్టాన్ని నివారించవచ్చని సూచించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డా.చల్లా వెంకటనరసింహారావు, డా. మానుకొండ శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ఎం.శ్రీనివాస్, ఏవో బి. రాజారావు, రైతులు పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

బలరామ్మూర్తికి సంతాపం

చాగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత గారపాటి బలరామ్మూర్తి మృతికి పలువురు కూటమి నాయకులు గురువారం సంతాపం తెలిపారు. ఆయన కుటుంబాన్ని జడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ శ్రీనివాసరావు దంపతులు పరామర్శించారు. బ్రాహ్మణగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు రాజీవ్ కృష్ణ, తదితరులు పాల్గొని బలరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కోరుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్ గురువారం సాయంత్రం శ్రీరంగపట్నంలోని బురద కాలువను పరిశీలించారు. అనంతరం గోకవరం మండలం అచ్యుతాపురం వద్ద చెరువు గండి కొట్టడంతో నీరు పొంగి ప్రవహించిన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో, తదితరులు పాల్గొన్నారు.

మొత్త మొంథా?

• తుఫాన్ పంట నష్ట వివరాలు సేకరిస్తున్న అధికారులు
• నేలమట్టమైన వరి, అరటి, కూరగాయ పంటలు
• తనిఖీలో ఉద్యానవన అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు

కొవ్వూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలలో జాగ్రత్తలు పాటిస్తే నష్ట తీవ్రతను తగ్గించుకోవచ్చునని కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డా.లలితా కామేశ్వరి, డా. రవీంద్రకుమార్ అన్నారు. కొవ్వూరు ఉద్యానవన శాఖాధికారి డి.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం దొమ్మేరు, పెనకనమెట్ట, తాళ్లపూడి మండలం మలకపల్లిలో వారంతా పర్యటించారు. ఈ సందర్భంగా అరటి, కూరగాయ పంటలను పరిశీలించారు. పెనకనమెట్ట సర్పంచ్ మేకల శ్రీనివాస్, దొమ్మేరు సొసైటీ చైర్మన్ గారపాటి రామకృష్ణ, రామారావు, రాంబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని డివిజనల్ వ్యవసాయాధికారి సీహెచ్.శ్రీనివాసరావు సూచించారు. కుమారదేవంలో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈయనతో మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, వీఏఏ విజయ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలో తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న అరటి, కూరగాయలు, పూలతోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు, అరటి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. రవీంద్ర కుమార్ , కొవ్వూరు ఉద్యాన అధికారి బి. సుధీర్ కుమార్, సచివాలయ ఉద్యాన సహాయకులు రోహిణి కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నష్టపోయిన రైతులు తమ వివరాలను సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే అన్నవరప్పాడులో దెబ్బతిన్న అరటి పంటలను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్శిటీ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అరటి చెట్లకు వంద గ్రాములు యూరియా వేయాలని నివారణకు పది గ్రాములు బ్లీచింగ్ పౌడర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ టి. నాగలక్ష్మి, డాక్టర్ జి. రంగన్న, స్థానిక సిబ్బంది, అరవంద సాయి, తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు మండలంలో ఉద్యాన వన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాళ్లపూడి: మొంథా తుఫాను ప్రభావానికి ఎక్కువ శాతం వ్యవసాయ పంటలు నీటమునిగాయి. మండలంలోని పలు గ్రామాలలో సుమారు మూడు వేల ఎకరాల్లో వరి, అరటి, మినుము పంటకు నష్టం వాటిల్లింది. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు వ్యవసాయ సహాయకుల ద్వారా పంటలను పరిశీలించి జాబితాలు తయారు చేయాలని ఆదేశించినట్లు ఏవో రుచిత తెలిపారు. సుమారు రెండు వేల ఎకరాల వరి పంట, 600 ఎకరాల్లో మినుము, 400 ఎకరాల వరకు అరటి పంటలు పాడైనట్లు తెలిపారు. కాగా నీట మునిగిన వరి పంట, తడిచిన ధాన్యం కొనే పరిస్థితి ఉండదని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావానికి ఉద్యానవన పంటలు పాడయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యానవన అధికారి డీ. సుధీర్ కుమార్ పర్యటించారు. డాక్టర్. పీ. లలిత కామేశ్వరి, డాక్టర్ కే. రవీంద్రకుమార్, ఉద్యానవన సహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


కాకరపర్రులో అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు


తాళ్లపూడిలో పాడైన ఉద్యాన వన పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

దేవరపల్లి: మండలంలో మొంథా తుఫాన్ వల్ల 810 ఎకరాల్లో వరి, 125 ఎకరాల్లో మినుముపంట నష్టపోయినట్టు మండల వ్యవసాయాధికారి కమలరాజు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంట నష్టాలను అంచనా వేస్తున్నామని, మండలంలో 15 గ్రామాల్లో పర్యటించటం జరిగిందని ఆయన తెలిపారు. నేలనంటిన వరిపంట పై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

గోపాలపురం: వరద నీటి ప్రవాహాన్ని దారి మళ్లించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని పారిశుధ్య విభాగం ఈఈ గిరి అన్నారు. తుఫాన్ కారణంగా పొంగిపొర్లిన డ్రైన్లు,రోడ్లను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం వాదాలకుంట నుంచి ప్రవహిస్తున్న వరదను దారి మళ్లించేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా తాడిపూడి ఉపకాల్వ పై నిర్మించిన కాజ్‌వేను ఆయన పరిశీలించారు. తమ పరిశీలనలో తేలిన విషయాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పార్వతి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, గోపాలపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు వాసు, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్ బాబు, తెలుగు యువత కార్యదర్శి హుస్సేన్, మల్లిపూడి సుబ్బారావు, రవి, తదితరులు ఉన్నారు.

వేడుకగా స్వామివారి ఆలయ పునఃప్రారంభం

చాగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మార్కొండపాడు ఉమా మార్కండేయస్వామి ఆలయ పునః ప్రారంభ కార్యక్రమాలు గురువారం వేడుకగా జరిగాయి. గత మూడు రోజులుగా స్వామివారి విగ్రహ పునః ప్రతిష్ఠ అత్యంత వేడుకగా జరుగుతోంది. ఈసందర్భంగా గురువారం మంత్రి కందుల దుర్గేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామి వారిని దర్శించుకుని పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. జనసేన నాయకుడు ఉప్పులూరి చిరంజీవి, టీడీపీ నాయకుడు సుంకవల్లి రమేష్, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.


మార్కొండపాడులో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

వెంకన్న ఆలయంలో కల్యాణం


అన్నవరప్పాడులో పూజలు చేస్తున్న దృశ్యం

పెరవలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రవణ నక్షత్ర యుక్త మాసకల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రకాశరావుపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

నల్లజర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెంలో బుధవారం రాత్రి ముగ్గురు రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి అందులో ఉన్న రాగి వైరును గుర్తుతెలియన దుండగులు దొంగిలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు టేకు రామకృష్ణ, మద్దిపాటి దొరరాజు, అప్పసాని ప్రసాద్‌కు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. కాగా, గురువారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు దీన్ని గుర్తించి నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తస్కరించిన దృశ్యం

తుఫాన్ నష్ట నివారణపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కొవ్వూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న నష్టాలను శాఖల వారీగా తయారుచేసి నివేదికలు అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం మున్సిపల్, సచివాలయ సిబ్బందితో మున్సిపల్ చైర్పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల వల్ల రాష్ట్రంలో తుఫాన్ నష్ట తీవ్రతను కొంతమేరకు తగ్గించగలిగామన్నారు. నియోజకవర్గంలో మూడు మండలాలు, మున్సిపాల్టీలో అధికారులు కలిసికట్టుగా పనిచేయడంతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. మున్సిపాల్టీ పరిధిలో తుఫాన్ నష్టాలను శాఖల వారీగా తయారుచేసి అందించాలన్నారు. వర్షాలకు ఇళ్లు పడిపోయిన వారికి గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రాలలో నివాసం ఉన్న తుఫాన్ బాధిత కుటుంబాలకు రైస్, నిత్యవసరాలు, కుటుంబానికి రూ.3 వేలు ఆర్థికసాయం అందించడం జరుగుతుందన్నారు. శ్రీనివాసపురంలోని బ్రిడ్జిపేట, రాజీవ్‌కాలనీలలో డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చైర్‌పర్సన్ బావనరత్నకుమారి మాట్లాడుతూ ఎంతటి విపత్తు ఎదురైనా ఎదుర్కోగలమని పట్టణంలో అధికార యంత్రాంగం కలిసికట్టుగా నిరూపించారన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ తుఫాన్ అనంతరం పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా సచివాలయ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, టిపివో టి.మణిరామ్, మేనేజర్ భరత్, ఏఈ సుమంత్, ఆర్ఐ డి.శ్యామ్, శానిటరీ ఇన్‌చార్జి రవి, సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ డ్రైవర్లపై కేసు

• వెల్లడించిన పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ చిరునామాలు చూపించి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు లారీడ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఈ నెల 23వ తేదీన కొవ్వూరు పట్టణంలోని దండకొండరేవు ఇసుక ర్యాంపులో తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా మైనింగ్ అధికారి డి.ఫణిభూషన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. ఇందులో మూడు లారీలను సీజ్ చేసి గురువారం పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఫణిభూషన్‌రెడ్డి ఫిర్యాదుపై లారీడ్రైవర్లు నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్‌కే.ఫరూక్, కె.వెంకటేష్, ఎస్‌కె. హసన్‌మియాపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ముంపు నివారణకు శాశ్వత చర్యలు : ఎమ్మెల్యే

దేవరపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో గురువారం ఆయన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన డ్రైనేజీని పరిశీలించారు. గతంలో డ్రైనేజీల్లో పూడికతీయకపోవడం, పక్కా డ్రైన్లు నిర్మించకపోవడంతో యాదవోలు వాగు వల్ల గ్రామాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇళ్లు కూడా ముంపునకు గురయ్యాయన్నారు. కోటి రూపాయలతో నిర్మించి ముంపునకు గురికాకుండా చేయడం జరిగిందని తెలిపారు. అలాగే దేవరపల్లి ఊరచెరువు, వెంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ భక్తు సౌకర్యార్థం చెరువుగట్టు సుందరీకరణ చేయడానికి రూ.80 లక్షలతో ప్రాథమిక అంచనా వేశామని తెలిపారు. ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించటం, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, టీడీపీ నేతలు కాట్రు భీమరాజు, శ్రీనివాస్, ముళ్లపూడి దొరాజీచౌదరి, కరుటూరి బాలాజీ, నందిగం శ్రీధర్ పాల్గొన్నారు.


దేవరపల్లిలో డ్రైన్‌ను పరిశీలిస్తున్న మద్దిపాటి

గోపాలపురం: తుఫాన్ ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పెద్దాపురం, జగన్నాథపురం, చిట్యాల, ఉప్పరగూడెం, నందిగూడెం, తదితర గ్రామాలు జలమయమయ్యాయి. నీట మునిగిన ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించి గురువారం బాధితులతో మాట్లాడారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, గన్నిన మురళీ, యాళ్ల శ్రీను, తహశీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీవో రాజ మనోహర్, తదితరులు ఉన్నారు.

నల్లజర్ల: దూబచర్లలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు కంచెర్ల నాగేశ్వరరావు కుటుంబానికి గ్రామ టీడీపీ నాయకులు రూ. 30 వేలు విరాళం సేకరించి గురువారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు రూ.10 వేలు, ఎంపీటీసీ ఈడే శ్రీనివాసరావు రూ. 5 వేలు, అప్ప సాని రాంబాబు రూ. 5 వేలు, చంద్రు నాగేశ్వ రరావు రూ.5వేలు, బేతిన లక్ష్మణరావు రూ. 5 వేలు విరాళం అందించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తా : పిక్కి

చాగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలుగా ఆదుకుంటాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం చాగల్లులో బీజేపీ నాయకులతో కలిసి ఆయన తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత నష్టాన్ని తగ్గించడానికి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. పంట నష్టం వివరాలపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నామని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్, నాయకులు బోడపాటి ముత్యాలరావు, కరుటూరి జగన్, తదితరులు పాల్గొన్నారు.


చాగల్లులో వరిపంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి


కాల్దరిలో ఓ వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

ఉండ్రాజవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ అనంతరం గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. కాల్దరిలో గురువారం నిర్వహించిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చా డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, రోడ్ల పక్క చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో సూచించారు. రక్షిత నీరును క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించాలని చెప్పారు. శానిటేషన్ కోఆర్డినేటర్ కె. ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నల్లజర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పంట బోదెలో ఉన్న విద్యుత్‌తీగను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మద్దుకూరి సత్యనారాయణ (53) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన పోతవరం శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలివి... బుధవారం రాత్రి కురిసిన వర్షం ధాటికి వరి పొలం నేల కొరిగిందో లేదోనని చూద్దామని సత్యనారాయణ ఉదయం పొలానికి నడిచి వెళుతున్న క్రమంలో బోదెలో విద్యుత్ తీగ అడ్డుపడింది. దాన్ని పక్కకు తప్పించే క్రమంలో చేతి మీదకు రావడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. మధ్యాహ్నం తోటి రైతులు గుర్తించి నల్లజర్ల పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. సత్యనారాయణకు భార్య నాగమణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.